27-11-53



వచ్చు, నిర్మాతతోబాటు రాబడిలోనూ, లాభ నష్టాలలోనూ వాటా తీసుకోవచ్చు. ఇట్లా చేసిన పక్షాన చెడ్డ చిత్రాలకు వీరు డబ్బుపెట్టే అవకాశం ఉండదు; నష్టపడతారు. వీరు ప్రస్తుతం ఏ షరతులమీదనైతే నిర్మాతకు డబ్బు ఇస్తున్నారో ఆ షరతులు చెడ్డ చిత్రాలను తప్పక ప్రోత్సహిస్తున్నాయి. డబ్బుపెట్టిన చిత్రనిర్మాతా, ఆ నిర్మాతను నమ్మి తమ శ్రమను అరువుపెట్టిన నటులూ, స్టూడియోవారూ, ఆర్థిక సహాయం చేసిన డిస్ట్రిబ్యూటరూ చిత్రంమీద వచ్చే సొమ్మును దామాషాప్రకారం పంచుకునేటట్లు ప్రభుత్వం శాసించేపక్షంలో తుచ్ఛ చిత్రాల నిర్మాణం తప్పేమని తగ్గిపోతుంది; అది న్యాయమైన సూత్రంకూడా. నటులూ, స్టూడియోలవారూ ప్రతి అడ్డమైన చిత్రాన్ని నమ్మటం మానేస్తారు. డిస్ట్రిబ్యూటర్లనుకూడా ఏది మంచి చిత్రమో, ఎవరు సమర్థుడైన చిత్ర నిర్మాతో చాలా బాగ తెలిసివస్తుంది. చచ్చు చిత్రాల సంఖ్య తగ్గితే చిత్రాల సంఖ్య మూడోవంతును దానంతట అదే తగ్గుతుంది. సినిమా పరిశ్రమ బాగుపడుతుంది.

ఒకవేళ ప్రభుత్వం జోక్యం కలిగించుకోక పోయినా పనికిమాలిన చిత్రనిర్మాతలు కాలక్రమాన నిష్క్రమిస్తారని అనవచ్చు. కాని మంచి చిత్రనిర్మాతలకు ఇప్పటికే చాలా అన్యాయం జరిగింది. చిత్రనిర్మాణ సంఖ్య సరిఅయిన ప్రమాణానికి తరిగేలోపుగా మరింత అన్యాయం జరగవచ్చు. డిస్ట్రిబ్యూటర్లు—అచ్చగా కమిషన్ కొరకే పనిచేసే కొద్దిమంది మినహాగా—ఇంకా మరి కొంతమంది తారలను చిత్రనిర్మాణంలోకి దింపి మరి కొన్ని తుచ్ఛ చిత్రాలు తీయించి నష్టపరిచే అవకాశం లేకపోలేదు.

ముఖ్యమైన ఫలితం చిత్రాల సంఖ్య తగ్గటం. రెండవది పనికిమాలిన నిర్మాతలు సినిమారంగం నుంచి నిష్క్రమించటం. మనదేశపు జనాభా ఇంతకుమించితే తీవ్రపరిస్థితి ఏర్పడుతుందని నివేదిక తయారుచేయటంలో అర్థమున్నప్పుడు, మన చిత్రాల సంఖ్య ఇంతకు మించటంవల్ల సినిమారంగంలో తీవ్రపరిస్థితి ఏర్పడిందనుకోవటం అసమంజసం కాదు

తెలుగులో ఏడాదికి ఏడెనిమిది చిత్రాలు మించి తయారుకావడం దండుగ. అంతకుమించి మంచి చిత్రాలు తీయటానికి అవకాశాలుకూడా న్యాయంగాలేవు-ఉన్న యదార్థం అదే.

---

స్కెచ్

# లోగుట్టు

**శ్రీరాగి**

విశ్వం ఆ ఆఫీసులో కొత్తగా జాయినయ్యాడు.

అతను ఇదే మొదటిసారి ఉద్యోగంలో ప్రవేశించటం. అతను అదృష్టవశాత్తు అకౌంటు సెక్షనులో పడటం మూలాన, కంట్రాక్టర్ల బిల్లులు చూసే సీటు అతని కొచ్చింది. ఆ సీటులో పడటం తన అదృష్టమే అనుకొన్నాడు విశ్వం.

అతను ఆ రోజు ఉదయం పది గంటలకు డ్యూటీకి రిపోర్టుచేశాడు ఆఫీసరుకు.

ఆఫీసరు విశ్వాన్ని ఎగాదిగా చూశాడు.

"నీ పేరేమిటి?" అన్నాడాఫీసరు.

"విశ్వం అంటారండి" అన్నాడు తన సహజ ధోరణిలో.

"విశ్వం అంటారా? అంటే అది నీ పేరేనా?" అడిగాడు ఆఫీసరు.

విశ్వానికి ఇప్పుడు గుర్తొచ్చింది. తను ఉద్యోగం చెయ్యబోయే ఆఫీసరుతో మాట్లాడుతున్నాననీ, తను స్నేహితులతో పరాచికాలాడినట్లు ఇక్కడ జవాబు చెప్పకూడదనీ.

"క్షమించండి. నా పేరు విశ్వేశ్వర్రావు. నా మిత్రులు విశ్వం అని పిలుస్తుంటారు" అన్నాడు.

"అలాగా? అయిదే నీకదివరకు ఉద్యోగానుభవేమన్నా వుందా?" అన్నాడు.

"లేదండి. ఇదే నా ప్రథమ ఉద్యోగం."

"అయితే కొన్నాళ్లు ఈ ఉద్యోగం కష్టం

గానే ఉండొచ్చు. మీ కిచ్చిన సీటు చాలా బాధ్యతతో కూడుకున్నది. చాలా జాగ్రత్తగా చేసుకోవలసుంటుంది."

విశ్వం బుర్రలో ఎక్కడోవున్న తెలివిని ప్రదర్శించాడు.

"మీదయవుంటే నాకేంఫర్వాలేదు" అన్నాడు.

"కష్టపడి పని చేసేవాళ్ళంటే ఎప్పుడూ నా కిష్టమే. ఎక్కడయినా కష్టపడితేనే ఫలితం దక్కేది. వెళ్ళి పని చేసుకోండి."

ఆఫీసరు మాటల్లో విశ్వానికి ఏదో గూడార్థం తోచింది. కాని ఫలానా అని తెలుసుకోలేక పోయినాడు.

విశ్వం తన సీటులోకి వెళ్ళి బిల్లులు చూసుకోవారంభించాడు. అదివరకు గడచిన ఫైల్సు తిరగ వేసి, విశ్వం వారంరోజులలో తన పని క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు.

వారంరోజుల తర్వాత ఆఫీసరు విశ్వాన్ని పిలిచాడు.

"గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు విశ్వం.

"గుడ్ మార్నింగ్" ప్రతి నమస్కారంచేశాడు ఆఫీసరు.

"మీకు పని తెలుస్తున్నదా?" అడిగాడు ఆఫీసరు.

"ఇప్పుడిప్పుడే తెలుస్తున్నదండీ" జవాబు ఇచ్చాడు విశ్వం.

"కామయ్యగారు మన ఆఫీసుకు నెలరోజుల క్రిందట మూడువేలరూపాయిల విలువగల స్టేషనరీ సామాన్లు సప్లయిచేసారు. వారి బిల్లు మీ దగ్గరకొచ్చిందిగదూ?"

"కామయ్యగారి స్టేషనరీ బిల్లు వచ్చిందండి."

"ఆ బిల్లును సరిచూసి త్వరగా ప్యాసు చెయ్యండి."

"అలానేసార్!"

"ఇంక మీరు వెళ్ళవచ్చు."

తరువాత రెండుమూడురోజులలో కామయ్యగారి బిల్లు చూడటం మొదలుపెట్టాడు. క్రిందటి సంవత్సరాలలో స్టేషనరీ సప్లయిచేసిన కంట్రాక్టర్ల బిల్లులతో కామయ్య బిల్లు పోల్చిచూస్తే, కామయ్య ధరలు ఎక్కువగా కనిపించినయి.

విశ్వానికి ఏంచెయ్యాలో తోచలేదు. తనకా అనుభవం తక్కువ. ఎక్కువ ధరలు వేశాడని బిల్లు మొత్తం తగ్గించి ప్యాసుచేస్తే ఆఫీసరు ఏమంటాడో అని భయం విశ్వానికి కలిగింది. తన సీటులో బాగా డబ్బులొస్తాయని తోడి గుమాస్తాలు అనుకొంటుండగా విన్నాడు. ఆ డబ్బులు వచ్చే దారేది? కామయ్య తనదగ్గరకొచ్చి ఏమన్నా మాట్లాడతాడా అంటే అతనేం వచ్చేటట్లు కనపడలేదు.

ఆలస్యంచేస్తే ఆఫీసరు ఏమంటాడేమోనని కామయ్య బిల్లు, విశ్వం ఆఫీసరు సంతకానికి పెట్టాడు.

ఆఫీసరు కామయ్య బిల్లును మొదటునుంచీ చివరిదాకా తనిఖీచేయటం మొదలుపెట్టాడు. చివరకి ఇలా అన్నాడు:

"దీంట్లో కామయ్యగారు వేసిన ధరలుచూస్తే చాలా అధికంగా కనపడుతున్నాయి. తరువాత తీరికగాచూసి ఈ బిల్లును ప్యాసుచేద్దాము. ప్రస్తుతానికి బిల్లునట్టేపెట్టండి."

మిగతా కాగితాలు ఏవో వుంటే అవి ఆఫీసరుచేత సంతకంపెట్టించుకొని వచ్చేశాడు విశ్వం.

విశ్వం చాలా ఆశ్చర్యపడ్డాడు.

తను అనుకొన్నాడు బిల్లుచూడగానే సంతకం పెడతాడని. కాని ఆఫీసరు బిల్లును ఎందుకు తిరగ్గొట్టినట్టు? బిల్లును వెంటనే ప్యాసుచేసి తీసుకు రమ్మని తనే మొదటచెప్పి, ఇప్పుడలా ఎందుకు చేశాడు?

విశ్వానికి దీనిలోనికీలకం ఎంత ఆలోచించినా అర్థంకాలేదు.

కామయ్య రోజూ ఆఫీసుకు బిల్లుకోసం వచ్చి తిరిగిపోతూనే వున్నాడు. కాని బిల్లు ఆఫీసరు సంతకం కావటంలేదు.

ఆ తర్వాత పదిరోజులకు ఆఫీసరు ఇంట్లో పనిచేసే జమాను పిచ్చయ్య విశ్వాన్ని పలకరించాడు.

"ఏమండీ విశ్వంగారూ, నమస్కారం." అన్నాడు. "నమస్కారం" అన్నాడు అతనెవరో తెలీక.

పిచ్చయ్య తనకు తనే పరిచయం చేసుకున్నాడు. విశ్వానికి పిచ్చయ్యను కామయ్యసంగతేమన్నా తెలుసేమో అడగాలనిపించింది

"పిచ్చయ్యా, నీ కెన్నాళ్ళ సర్వీసుంది?"

"నాకండి బాబూ! ఎంతలేకేమండీ. ఇరవైయేళ్ళ సర్వీసుందండీ. ఈ అయ్యగారి దగ్గరే, మూడేళ్ళనుంచీ వుంటున్నాను. ఈ మూడేళ్ళలో మీ సీటులో ఎంతమంది మారేరో?"

"ఏఁ? ఎందుకని?"కుతూహలంతో అడిగాడు విశ్వం.

"మీకు తెలీనిదేముంది మీ సీటు సంగతి? మీ సీటులో తలుచుకుంటే ఎంతయినా సంపాదించవచ్చు."

ఆఫీసరుఇంట్లో పనిచేస్తున్న పిచ్చయ్యకు తన సీటు విషయం ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోయాడు.

విశ్వం మొహంలోని ఆశ్చర్యాన్ని పిచ్చయ్య గమనించాడు.

"ఏంది విశ్వం బాబుగారు అలా ఆశ్చర్యపోతున్నారు?" అన్నాడు.

విశ్వానికి పిచ్చయ్య కాలాంతకుడిలాగా కనుపించాడు.

పిచ్చయ్య తిరిగి అన్నాడు,

"ఆఫీసరుగారు ఆఫీసుకి పదకొండు గంటలకొచ్చేలోపల ఎవరెవరొచ్చేదీ నేను కనిపెడుతూనే వుంటాను. ఆఫీసరుగారు నాకు తెలీకుండా లంచాలు పట్టాలని ఎంత ప్రయత్నించినా, ఏ విషయం నాదాకా రాకుండాపోదు."

కామయ్య సంగతి పిచ్చయ్యను అడిగి ఇప్పుడే తేల్చుకోవాలనుకున్నాడు.

"అయితేపిచ్చయ్యా, కంట్రాక్టరు కామయ్య నెరుగుదువూ?" అన్నాడు విశ్వం.

"అయ్యో రామ! వారి నెరక్కపోవటమేమిటండీ. ఇన్ని సంవత్సరాలనుంచీ ఇక్కడ పని చేస్తూనూ?" అన్నాడు పిచ్చయ్య.

"ఆయనేమన్నా ఈమధ్య మన ఆఫీసరుగారింటికొచ్చాడా?"

"మొన్న పదిరోజుల క్రిందట ఉదయము వచ్చాడండీ నేను ఆఫీసరుగారి ప్రైవేటు రూమ్ దగ్గరే నిలబడున్నాను. చాలాసేపు వాళ్ళిద్దరూ యేదో మాట్లాడుకున్నారు. మా ఆఫీసరుగారు యేదో ఆయన్ని రెండు ఇయ్యమంటున్నారు. ఆయన ఈ బిల్లులో నాకేం పెద్ద లాభంలేదు. ఒకటే ఇస్తాను అంటున్నాడు. చివరికి ఏమీకుదిరినట్టులేదు"అన్నాడు పిచ్చయ్య.

విశ్వానికి కామయ్యగారిబిల్లు ఆఫీసరుఎందుకు ప్యాసుచెయ్యలేదో ఇప్పుడు తేలికగా బోధపడింది.

కామయ్య బిల్లు మూడువేలకీ, కామయ్య సప్లయిచేసిన స్టేషనరీ మొదటిరకానికి చెందినవి కావనేసాకుతో, రెండువేల నాలుగు వందలకి తగ్గించబడి ప్యాసుచేయబడింది తర్వాత రెండు నెలలకి.

ఒకసంవత్సరం గడిచింది. విశ్వం ఒక్కసంవత్సరంలో బాగా అనుభవం సంపాదించుకున్నాడు. ఎలాగైనా కంట్రాక్టర్లదగ్గర కాలికి వేస్తే మెడకీ, మెడకివేస్తే కాలికీపెట్టి డబ్బు సంపాదిద్దామనుకుంటున్నాడు ఒకటి రెండు కేసులలో కొద్దిగా సంపాదించాడు కూడా. ఆ రెండు కేసులలోనూ విశ్వంమూలాన ఆఫీసరు ఆదాయం తగ్గింది.

ఆ తర్వాత వారంరోజులలో విశ్వం మరో వూరికి బదిలీ చేయబడ్డాడు. ఒకసంవత్సరమన్నా కాకముందే తను బదిలీ అయినందుకు విశ్వం ఆశ్చర్యపడ్డాడు. కాని ఆఫీసులోని ఇతర గుమాస్తాలకిదేం విడ్డూరంగా కనపడలేదు. ఎందుకంటే ఆ సీటులో విశ్వంలాగే ఎవరూ ఆరుమాసాలూ సంవత్సరంకన్న ఉండలేదు. దానికి కారణం అందరికీ సులభగ్రాహ్యమే. విశ్వం తర్వాత ఆసీటులో ఇంకో అనుభవంలేనిగుమాస్తా నియమించబడ్డాడు.

